సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



విద్యార్థుల సమర్థతకు పరీక్ష

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎస్‌ఈఏఎస్‌ను నిర్వహిస్తోంది. - 4లో



జపాన్ వైద్య బృందం పర్యటన

సతివాడ పీహెచ్‌సీ పరిధిలోని ఒమ్మి, సతివాడ గ్రామాల్లో జపాన్ వైద్య బృందం గురువారం పర్యటించింది. - 4లో

నేడు సీతంపేటలో జగనన్నకు చెబుదాం

పార్వతీపురం: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ నిషాంత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ఈ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యలపై వినతులు అందజేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

అసైన్డ్ భూములకు హక్కులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో అసైన్డ్ భూములు సాగు చేస్తున్నవారికి ఈ నెల 14న హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని సీసీఎల్ఏ సెక్రటరీ సాయిప్రసాద్ తెలిపారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 20 ఏళ్ల కిందట పంపిణీ చేసిన అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పత్రాలు అందజేసే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆ రోజు శ్రీకారం చుడతారన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ రోణంకి గోవిందరావు పాల్గొన్నారు.

వింత మేక పిల్ల జననం



వింత మేకపిల్ల

సాలూరు: మండలంలో తోణాం పంచాయతీ దిగువమెండంగిలో తాడంగి అప్పలస్వామికి చెందిన పెంపుడు మేకకు వింత మేకపిల్ల గురువారం జన్మించింది. మనిషి తలను పోలిన మేకపిల్ల జన్మించిన కొద్దిసేపటికే మృతి చెందగా, ఖననం చేశారు.

గిరిజన సంక్షేమ వసతిగృహం తనిఖీ



జియ్యమ్మవలస గిరిజన సంక్షేమ వసతి గృహం విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని పరిశీలించారు. ఓపీల నమోదు, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మందుల నిల్వ వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

రంగనాథంకు 'కొండేపూడి' పురస్కారం



రాజాం సిటీ: రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం రచించిన 'రాయరత్న మంజూష' అనే గ్రంథానికి విశాఖపట్నంకు చెందిన కొండేపూడి సుబ్బారావు సాహితీ పురస్కారం లభించింది. ప్రసన్నభారతి సాహిత్య పురస్కారాలు-2023కు సంబంధించి విమర్శ గ్రంథం/వ్యాససంపుటి విభాగంలో పురస్కారం లభించినట్టు రంనాథం తెలిపారు. డిసెంబర్ నెలలో జరగనున్న ఆంధ్రసాహితీ మహాసదస్సు సాహిత్య సభలో పురస్కారంతో పాటు రూ.5,116లు నగదు అందజేస్తారన్నారు. రంగనాథంకు పురస్కారం లభించడంపై రాజాం రచయితల వేదిక సభ్యులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



వనంగుడిలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి వనంగుడి హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 19 రోజులకు రూ.8 లక్షల 91వేల 378ల నగదు, 12 గ్రాముల 500 మిల్లీ గ్రాముల బంగారం, 164 గ్రాముల వెండి లభించినట్టు ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తెలిపారు.

ఇంతులలో సంక్షేమ కాంతులు



- మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట
- కుటీర పరిశ్రమలు, దుకాణాల నిర్వహణకు ఆర్థిక తోడ్పాటు
- అభివృద్ధి దిశగా మహిళలు

పార్వతీపురంటౌన్:

మహిళల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. 'నవరత్నాలు' అమలులో మహిళలకు పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు అందిస్తోంది. రుణాలను బ్యాంకుల నుంచి విరివిగా మంజూరు చేయిస్తోంది. నాలుగున్నరేళ్లుగా వివిధ పథకాల కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. కుటీర పరిశ్రమలు, కిరాణా దుకాణాలు, డెయిరీ ఫాంలు నిర్వహిస్తూ ఆర్థికోన్నతి చెందుతున్నారు. కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. జీవన ఉన్నతికి బాటలు వేసుకుంటున్నారు. ఆర్థికంగా ఎదుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మొత్తం 19,528 స్వయం సహాయక సంఘాల్లోని 2,25,667మంది మహిళలకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయంఅందుతోంది.

రూ.947.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుండగా, దీనికి బ్యాంకులు తోడ్పాటునందిస్తున్నాయి. బ్యాంకు లింకేజీ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి స్వయం సహాయక సంఘాల పరిధిలో ఉన్న 2,60,500 మంది లబ్ధిదారులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా, 2,48,419 మంది మహిళలకు రూ.947.94 కోట్లమేర రుణాలను నేరుగా వారి గ్రూపు ఖాతాల్లో జమచేశారు. స్త్రీనిధి పథకం కింద 16,496 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ పంపిణీ లక్ష్యం కాగా 15,200 మందికి రూ.2.20 కోట్లు అందించారు.



బాలడుగబ గ్రామంలో రుణం తీసుకుని కిరాణాషాప్ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళ

సున్నా వడ్డీ భరోసా..

మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ఆర్థిక భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. జిల్లాలోని 2,24,589 మంది మహిళల ఖాతాల్లో రూ.30.50 కోట్ల మేర వడ్డీరాయితీని జమ చేసింది. దిగువ, మధ్యతరగతి మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా బ్యాంకులతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని వ్యాపారం, స్వయం ఉపాధి రంగాల్లో ప్రోత్సహిస్తోంది. క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు తీసుకున్నవారి వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది. అలాగే, వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆర్థిక సహకారం అందించడంతో పాటు వ్యాపార రంగంలో రాణించేలా మెలకువలు నేర్పుతోంది. సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇప్పిస్తోంది. 45-60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల మహిళలకు ఏటా రూ.18,750 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ నాలుగేళ్లలో రూ.75 వేలను ఉచితంగా అందిస్తోంది. ఈ పథకం కింద మూడు విడతల్లో జిల్లాలోని 6,8032 మంది మహిళల ఖాతాలకు రూ.249.72 కోట్ల మొత్తాన్ని జమ చేసింది.

జిల్లాలో మహిళా 'సంక్షేమం' ఇలా...

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
జగన్న తోడు	12,498	49.99
బ్యాంకు లింకేజీ ద్వారా	2,48,419	947.94
వైఎస్సార్ ఆసరా(డీఆర్‌డీఏ)	1,65,083	157.43
వైఎస్సార్ ఆసరా (మెప్మా)	26,014	30.87
వైఎస్సార్ చేయూత(డీఆర్‌డీఏ)	68,032	249.72
వైఎస్సార్ చేయూత(మెప్మా)	7,258	37.38
వైఎస్సార్ సున్నా వడ్డీ	2,24,589	30.50

మాకు మంచి అన్నదొరికాడు..



మహిళలందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నలా ఆదుకుంటున్నారు. స్వయం సహాయక బృందంలో చేరి బ్యాంకు ద్వారా రూ.35 వేల రుణం పొందాను. టైలరింగ్ పని ప్రారంభించాను. రూ.2వేలు నా వంతు పెట్టుబడిగా పెట్టాను. వ్యాపారం ఆశాజనకంగా నడుస్తోంది. సకాలంలో రుణం చెల్లిస్తున్నాను. ప్రస్తుతం నెలవారీ రూ.6వేల నుంచి 8 వేల వరకు ఇంటివద్దనే ఉంటూ సంపాదిస్తున్నాను. జగనన్నకు ధన్యవాదాలు.

– చుక్క పద్మ, పెద్ద బొండపల్లి గ్రామం, పార్వతీపురం

మహిళలకు కొండంత అండ



మహిళలకు బ్యాంకు లింకేజీతో పాటు సున్నా వడ్డీ పథకం రాయితీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా కొండంత అండనిస్తోంది. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నింటిలోనూ మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళాసాధికారత దిశగా అడుగులు వేయాలి.

– కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

మహిళలకు పెద్దపీట

మహిళలకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం. కరోనా కష్టాల్లో గతంలో తీసుకున్న బ్యాంకు రుణాలు కట్టేందుకు ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తోంది. మా గ్రూపునకు రూ. లక్ష మంజూరైంది. చిన్న కిరాణా కొట్టు నిర్వహిస్తున్నాను. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను.

– మువ్వల పద్మ, బాలగుడబ గ్రామం, పార్వతీపురం



టైలరింగ్ షాప్ నిర్వహిస్తున్న మువ్వల పద్మ

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో అంగన్‌వాడీ పోషణ్-2.0 కింద కాంట్రాక్టు పద్ధతిలో జిల్లా కోఆర్డినేటర్, సహాయకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి తెలిపారు. ఏడాది కాలానికి పోస్టులు భర్తీలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు గజిటెడ్ అధికారి సంతకంతో కూడిన సర్టిఫికెట్ల జిరాక్సులను ఈనెల 10వ తేదీ సాయంత్రం 6 గంటలలోగా జిల్లా ఐసీడీఎస్ కార్యాలయానికి సమర్పించాలన్నారు.

క్రీడా విజేతలకు కలెక్టర్ అభినందనలు

విజయనగరం అర్బన్: ఢిల్లీలో ఇటీవల జరిగిన అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల క్రీడాపోటీల విజేతలను కలెక్టర్ నాగలక్ష్మి తన చాంబర్‌లో గురువారం అభినందించారు. రాష్ట్రజట్టు కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం, ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన సంగతి తెలిసిందే. ఖోఖో రాష్ట్ర జట్టులో ఆడిన గంట్యాడ మండలం పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ పి.లక్ష్మీప్రసన్న కుమార్, కబడ్డీ రాష్ట్ర జట్టులో ఆడిన డెంకాడ మండలం రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ కుర్మానభానును కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ ఈఓలు బ్రహ్మాజీ, వాసుదేవరావు, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ప్రభావతి, ప్రధానోపాధ్యాయులు కె.సౌభాగ్యలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు అభినందించారు.

4, 5 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

విజయనగరం అర్బన్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 4, 5వ తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి గురువారం తెలిపారు. ఓటరు జాబితా సవరణ, చేర్పులు, మార్పులపై దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌ఓలకు నేరుగా దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండిన వారు ఓటరుగా పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గిరిజన గురుకుల బాలికలకు రక్షణ

- సెక్యూరిటీ గార్డుల నియామకానికి చర్యలు
- వాచ్ అండ్ వార్డ్ పేరిట గతేడాది పనిచేసిన వారికి రెన్యువల్
- ఒక్కో పాఠశాలలో ఒకరి నుంచి నలుగురి వరకు ఏర్పాటు

సీతంపేట: గిరిజన గురుకుల బాలికా విద్యాసంస్థల్లో విద్యార్థినుల రక్షణకు వాచ్‌అండ్‌వార్డ్ పేరిట మహిళా సెక్యూరిటీ గార్డుల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతేడాది విజయవాడకు చెందిన ఎస్ఆర్ఆర్ అనే సంస్థ ఆధ్వర్యంలో నియమించిన సెక్యూరిటీ గార్డులను యథావిధిగా కొనసాగించాలని నిర్ణయించింది. ఒక్కో విద్యాసంస్థకు ఒకరు నుంచి నలుగురు వరకు విద్యార్థుల సంఖ్యను ఆధారంగా చేసుకుని మహిళా సెక్యూరిటీ గార్డులను నియమిస్తోంది. ఎస్ఆర్ఆర్ ప్రాజెక్టు నియమించిన వారిని అనుమతించాలని గురుకులం సొసైటీ జాయింట్ సెక్రటరీ రమణమూర్తి తాజాగా ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 73 బాలిక గిరిజన గురుకులాలు, 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 6 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 9 గురుకుల బాలికల పాఠశాలలు, మినీ గురుకులాలు, కళాశాలలు ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల్లో దాదాపు 3 వేల మందికిపైగా విద్యార్థినులు చదువుతున్నారు. వీరందరి భద్రత దృష్ట్యా వాచ్ అండ్ వార్డ్ గార్డులను నియమించింది. ఏడాది పాటు వీరు కొనసాగనున్నారు.



సీతంపేటలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాల

ప్రతిభావంతులకు సేవా పతకాలు



కేకేవీ విజయనాథ్, ఎస్‌బీ సీఐ | ఆర్.శ్రీనివాసరావు, దిశ డీఎస్పీ | నూకరాజు, ట్రాఫిక్ ఏఎస్‌ఐ | ఎల్.వెంకటరమణ, ఏఆర్ హెచ్‌సీ | ఎం.వి.ఆర్.సింహాచలం (రామా), కానిస్టేబుల్

విజయనగరం క్రైమ్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలువురు పోలీస్ అధికారులకు సేవా పతకాలను ప్రకటించింది. విజయనగరం జిల్లాకు చెందిన ఎస్‌బీ సీఐ కేకేవీ విజయనాథ్, దిశ మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏఎస్‌ఐ నూకరాజు, ఏఆర్ హెచ్‌సీ ఎల్.వెంకటరమణ, ఎంవీఆర్. సింహాచలం (రామా)లకు ఉత్తమ సేవాపతకాలు లభించాయి. సేవా పతకాలు పొందిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎం.దీపిక, ఏఎస్పీ అస్మా ఫర్హీన్, ఇతర పోలీస్ అధికారులు అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు.

1002 మందికి వైద్యం



పార్వతీపురంటౌన్: జిల్లాలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 1002 మందికి వైద్యసేవలు అందించినట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేశామన్నారు.

నేడు 3 చోట్ల జేఏఎస్ శిబిరాలు

పీహెచ్‌సీ	వైద్యశిబిరం నిర్వహించే ప్రాంతం
కుసిమి	తాలాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
జియ్యమ్మవలస	గవరంపేట, విలేజ్ క్లినిక్
వీరఘట్టం	నడిమి కెల్ల గ్రామ సచివాలయం

జిల్లాలో జేఏఎస్ శిబిరాల్లో గురువారం అందించిన సేవలు ఇలా..

వైద్యశిబిరాలు	2
ఓపీలు	1002
స్పెషలిస్టు ఓపీలు	346
సాధారణ ఓపీలు	585
డీఎం	58
హెచ్‌టీఎన్	182
ఏఎన్‌సీ	23
పీఎన్‌సీ	6
ఎనిమియా	14
ల్యాబ్ టెస్టులు	581
ఈసీజీ పరీక్షలు	12

అష్టలక్ష్ముల కృషితో ఉత్సవం విజయవంతం

- అమ్మ పండగలో కీలకపాత్ర పోషించిన అధికారిణులు, ప్రజాప్రతినిధులు
- శనివారం ఆలయం వద్ద నుంచి హుకుంపేటకు తరలించనున్న సిరిమాను
- తెప్పోత్సవానికి ఏర్పాట్లు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిగాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా అధికారయంత్రాంగం కృషికి అమ్మవారి ఆశీస్సులు లభించాయి. అమ్మ పండగ విషయవంతం చేయడంలో అష్టలక్ష్ములు కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, నగరమేయర్ విజయలక్ష్మి, డిప్యూటీమేయర్ శ్రావణి, దేవదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఏఎస్పీ అస్మాఫర్హీన్, ఈఓ సుధారణి, ఆర్డీఓ సూర్యకళ కీలకపాత్ర పోషించారు. కలెక్టర్ ఎ.నాగలక్ష్మి అందించిన సూచనలు, సలహాలు, ఎస్పీ ఎం.దీపిక డ్రోన్ కెమెరాలతో నిఘా, స్వీయపర్యవేక్షణ చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ఉత్సవం ముగిసింది. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సూచనలతో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఉత్సవంలో ఉత్తమ పనితీరు కనబర్చారు. దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ అన్ని శాఖల అధికారులు, వీఐపీలను సమన్వయం చేయడంలో తనదైన పాత్ర పోషించారు. అమ్మవారి ఉత్సవ తేదీల ప్రకటన నుంచి చివరి వరకూ పైడితల్లి ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి తనదైన ముద్ర వేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ సూర్యకళ దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. జిల్లా అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్ తొలేళ్ల, సిరిమానోత్సవం బందోబస్తు విధులు పకడ్బందీగా నిర్వహించడం, సిబ్బందిని సమన్వయం చేయడంలో తనదైన పాత్రపోషించి ఎస్పీ మన్ననలు అందుకున్నారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించే తెప్పోత్సవానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయం వద్దనున్న సిరిమానును శనివారం చదురుగుడి వద్ద నుంచి హుకుంపేటలో ఉన్న రాజగోపాల్ లాండ్రీకి తరలించనున్నారు.



చదురుగుడిలో పైడితల్లి అమ్మవారు



4న 'కోట'లో సామాజిక సాధికార బస్సు యాత్ర

- ఏర్పాట్లు పర్యవేక్షించిన మజ్జి శ్రీను, అప్పిరెడ్డి

శృంగవరపుకోట: జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను ప్రజలకు తెలియజెప్పేందుకు తలపెట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్ర ఈ నెల 4న శృంగవరపుకోటలో జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక దేవీ కూడలిలో బహిరంగసభ నిర్వహించనునట్టు వైఎస్సార్‌సీపీ నాయకులు చెప్పారు. బస్సుయాత్ర ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సామాజిక సాధికారత బస్సుయాత్ర రాష్ట్ర ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, మాజీ ఎమ్మెల్యే శోభాహైమావతి తదితరులు గురువారం పరిశీలించారు. సభ నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించి, స్థానిక నాయకులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు కలిగిన లబ్ధి, సామాజిక న్యాయంను బస్సుయాత్రలో మంత్రులు వివరిస్తారన్నారు. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్న, మేరుగ నాగార్జున సహా పలువురు నేతలు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ బస్సుయాత్రకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



బస్సుయాత్ర ఏర్పాట్లపై స్థానిక నాయకులకు సూచనలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న ఆదేశాలతో ఎస్.కోటలో సామాజిక సాధికారత బస్సుయాత్రను శనివారం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. నాలుగున్నరేళ్లలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అందించిన సంక్షేమం, రాజ్యాంగ పదవుల్లో ప్రాధాన్యం, ప్రజలకు ఏం చేశాం.. ఏం చేయబోతున్నాం అన్నది మంత్రులు వివరిస్తారన్నారు. ఏర్పాట్ల పరిశీలనలో ఐదు మండలాల ఎమ్పీపీలు, జెడ్పీటీసీలు, పలువురు సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర షెడ్యూల్ ఇదీ..

- శనివారం ఉదయం 10.30 గంటలకు శృంగవరపుకోట నియోజకవర్గం పరిధిలోని అలమండ గ్రామంలోని కెఐఎక్స్‌ఏ కల్యాణ మండపంలో పత్రికా సమావేశం.
- అనంతరం అలమండ గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ, అలమండ-1 గ్రామ సచివాలయం సందర్శన
- అలమండ నుంచి కొత్తవలస మీదుగా లక్కవరపుకోట మండలం గోల్డ్ స్టార్ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ. అక్కడే మధ్యాహ్న భోజనం విరామం
- మధ్యాహ్నం 3 నుంచి 5గంటలవరకు శృంగవరపుకోట దేవీ గుడిజంక్షన్ వద్ద బహిరంగ సభ కొనసాగుతుంది.

క్లుప్తంగా

బదిలీ ఉద్యోగికి ఘనంగా సన్మానం



సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో సి సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డి.శేఖర్ విశాఖపట్నం జీసీసీ జిల్లా మేనేజర్ కార్యాలయంలో సీనియర్ మేనేజర్‌గా డిప్యుటేషన్‌పై వెళ్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సిబ్బంది కార్యాలయంలో గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయం పరిపాలన అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో మూడేళ్లు జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: పోక్సో కేసుకు సంబంధించిన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు ఎస్పీ ఎం.దీపిక గురువారం తెలిపారు. ముద్దాయి పొడుగు అరవింద్ అలియాస్ హరి బాలికపై లైంగిక దాడికి పాల్పడడంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోక్సో యాక్ట్ ప్రకారం ఎస్సై వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, న్యాయ స్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారన్నారు. కేసును ప్రాధాన్యత కేసుల జాబితాలో చేర్చి, ప్రాసిక్యూషన్ త్వరితగతిన పూర్తిచేసి నిందితుడికి శిక్షపడే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. కేసులో పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మామూరి శంకరరావు వాదనలు వినిపించగా, టూటౌన్ కోర్టు కానిస్టేబుల్ డి.రాధిక, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారన్నారు. పోక్సో కేసులో త్వరితగతిన ముద్దాయికి శిక్ష పడేలా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక అభినందించారు.

వీఎల్ఎస్ఐ డిజైన్ కోర్సులతో ఉద్యోగావకాశాలు

- జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: విజువల్ సాంకేతకత (వీఎల్ఎస్ఐ) డిజైన్ కోర్సులపై ప్రావీణ్యం కలిగిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికమని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. ఈ మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాల కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ) విభాగం, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్, టెక్ ఫ్లూయంట్ సంయుక్తంగా మూడురోజుల పాటు నిర్వహించనున్న 'ఎనలాగ్ అండ్ డిజిటల్ వీఎల్ఎస్ఎల్ డిజైన్ యూజింగ్ మైక్రోవిండ్ ఈడీఏ టూల్' అనే జాతీయ సదస్సుకు గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఎల్ఎస్‌టీ డిజైన్ ప్రావీణ్యం కలిగిన వారిపై చాలా ఎక్కువ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని దీని గురించి తెలుసుకోవడం వల్ల మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఈ సదస్సు ఫ్యాకల్టీకి కూడా ఉపయోగపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. బేసిక్ డిగ్రీతోపాటు అదనంగా సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని సూచించారు. రిసోర్స్ పర్సన్‌గా మైక్రోవిండ్ ఇండియా హెచ్‌ఓడీ వినయ్ శర్మ, కన్వీనర్‌గా డాక్టర్ బి.నళిని వ్యవహరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.గురునాథ్, డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.బాబులు, ప్రొఫెసర్ కేసీబీరావు, వివిధ విభాగాల అధిపతులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గాజులరేగ గుభేల్‌పేటకు చెందిన వంకర సాయి (25) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 27న స్కూటీపై ఇంటికి వెళ్తూ సీతం కళాశాల వద్దకు వచ్చేసరికి డివైడర్ ఢీ కొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనంలో కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్సై ఆర్.గోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సమర్థతకు పరీక్ష

- ఎస్‌ఈఏఎస్‌లో భాగంగా ప్రాక్టీస్ టెస్టులు
- జిల్లావ్యాప్తంగా 1,698 పాఠశాలల్లో ఏర్పాట్లు
- నేడు పరీక్షలో పాల్గొననున్న విద్యార్థులు 13,861మంది



విద్యార్థులకు ఇస్తున్న శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ ఎన్.ప్రేమ్ కుమార్

పార్వతీపురంటౌన్: దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు సహా అన్ని రాష్ట్రాల్లో పాఠశాల విద్యావ్యవస్థ స్వరూపాన్ని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే-2023(ఎస్‌ఈఏఎస్)ను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా నవంబర్ 3న ఎస్‌ఈఏఎస్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని 1698 పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు ఓఎంఆర్ షీట్స్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటికే మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాపులు ఏర్పాటు చేయడంతోపాటు అక్టోబర్ 27 నుంచి విద్యార్థులకు ప్రాక్టీస్ టెస్టులు నిర్వహిస్తున్నారు. నవంబర్ 2వ తేదీతో ప్రాక్టీస్ టెస్టులు ముగియనున్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ప్రతి మూడేళ్లకు ఒకసారి ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నారు. 2024 ఫిబ్రవరిలో జాతీయ స్థాయి సర్వే నిర్వహించాలని కేంద్ర విద్యాశాఖ నిర్ణయించింది. దానికి ముందుగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో నవంబర్ 3న ఎస్‌ఈఏఎస్ నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. ప్రశ్నపత్రాలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి.

ఓఎంఆర్ విధానంలో పరీక్ష

ఎస్‌ఈఏఎస్ సర్వే పరీక్షను ఈ నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నారు. పరీక్ష ఓఎంఆర్ విధానంలో ఉంటుంది. 3, 6వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్‌లో గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించనున్నారు. 3వ తరగతి విద్యార్థులకు గంట, 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల పరీక్ష సమయం కేటాయించారు. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతి సిలబస్‌పై, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి, 9వ తరగతి విద్యార్థులకు 8వతరగతి సిలబస్‌పై పరీక్ష నిర్వహించనున్నారు.

అభ్యసన విధానాలు మెరుగవుతాయి



దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థలోని బలాలు, బలహీనతలు అంచనా వేయడం, లోపాలను గుర్తించి చేపట్టే గుణాత్మక బోధనతో అభ్యసన లక్ష్యాలను సాధించేలా అవసరమైన ప్రణాళికలు రూపొందించడమే ఎస్‌ఈఏఎస్ సర్వే పరీక్ష లక్ష్యం. భవిష్యత్‌లో అభ్యసన విధానాల్లో తగిన మార్పులకు దీని ద్వారా పూర్తిస్థాయిలో అవకాశం ఉంటుంది.

–సామల సింహాచలం,
ఎంఈఓ సంఘం జిల్లా అధ్యక్షుడు

పూర్తి స్థాయిలో శిక్షణ



పాఠశాలలో 6, 9వ తరగతి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్నాం. ముఖ్యంగా లాంగ్వేజ్‌తో పాటు గణితం, సైన్స్ సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తున్నాం. 6, 9 తరగతుల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధిస్తున్నారు. ఇలాంటి పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకోవచ్చు.

–ఎన్.ప్రేమ్ కుమార్,
డీఈఓ, పార్వతీపురం మన్యం

బస్సు ఢీకొని విద్యార్థి మృతి



అవినాష్(ఫైల్)

జామి: మండలంలోని భీమసింగి జంక్షన్‌లో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడిన విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమసింగి పంచాయతీ చిల్లపాలెం గ్రామానికి చెందిన ఎం.రెడ్డి అప్పలరెడ్డి, భార్య సంతోషి పాతభీమసింగి జంక్షన్‌లో స్వీట్‌బడ్డీపెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. తన తల్లిని బడ్డీ దగ్గర నుంచి ఇంటికి తీసుకువెళ్లడానికి కుమారుడు అవినాష్(14) చిల్లపాలెం నుంచి భీమసింగి బైక్‌పై వెళ్తున్న సమయంలో కొత్త భీమసింగి సమీపంలో విజయనగరం నుంచి అనకాపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే 108 వాహనంలో విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు, ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. అవినాష్ కుమరాం జెడ్పీ ఉన్నతపాఠశాలలో 9వతరగతి చదువుతున్నాడు, కుమారుడి మృతితో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై కేసునమోదుచేసి విచారణ నిర్వహిస్తామని ఎస్సై వీరబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ..



గుర్తు తెలియని మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్: మండల పరిధిలోని చెల్లూరు బడ్డుకొండ పేట పరిసర ప్రాంతాల్లో యాచకురాలు ఈ నెల ఒకటో తేదీన ప్రమాదానికి గురైందని రూరల్ పోలీసులు గురువారం తెలిపారు. 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం సాయంత్రం 5.30 గంటల సమయంలో మృతిచెందినట్లు రూరల్ ఎస్సై బి.గణేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డీవైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ

విజయనగరం ఫూల్‌బాగ్: డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక గురజాడ గ్రంథాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.హరీష్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రుద్రప్రసాద్ మాట్లాడుతూ అందరికీ విద్య, అందరికీ ఉపాధి ప్రభుత్వ బాధ్యతగా ఉండాలని కోరుతూ 1980వ సంవత్సరం నవంబర్ 1 2 3 తేదీలలో పంజాబ్ రాష్ట్రంలోని లూధియానా నగరంలో డీవైఎఫ్ఐని దేశ నలుమూలల నుంచి వచ్చిన ఆనాటి యువతీయువకులు ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు అవిశ్రాంతంగా పోరాడుతూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ 43 సంవత్సరాల కాలంలో భారతదేశంలో ఘనమైన చరిత్రను నిర్మించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న రెండు కోట్ల ఉద్యోగాలు, రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న 2.7 లక్షల పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. మెగా డీఎస్సీతో పాటు నూతన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని లేని పక్షంలో నిరుద్యోగులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో శిరీష, వరలక్ష్మి, రోహిత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జపాన్ వైద్య బృందం పర్యటన

- ఫైలేరియా నివారణపై అధ్యయనం



సతివాడ పీహెచ్‌సీ ఆవరణలో ఫైలేరియా బాధితులతో జపాన్ వైద్య బృందం ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ ప్రాథమిక ఆస్పత్రి పరిధిలో గల ఒమ్మి, సతివాడ గ్రామాల్లో జపాన్ వైద్యబృందం గురువారం పర్యటించింది. ఈఐఎస్ఏఐ అనే అంతర్జాతీయ సంస్థ గ్రామాల్లో ఫైలేరియా వ్యాధి నివారణ కోసం ఫైలేరియా ఎక్కువగా ఉన్న గ్రామాలను దత్తత తీసుకుంటోంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రధాన ప్రతినిధి యమోటో సేన్ తన బృందం సభ్యులతో కలిసి ఒమ్మిలో పర్యటించారు.

ఈ సందర్భంగా గ్రామ పరిసరాలను పరిశీలించి ఫైలేరియా వ్యాధిపై అధ్యయనం చేశారు. ఫైలేరియాతో బాధపడుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం ఫైలేరియా నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సతివాడ పీహెచ్‌సీ వైద్యులు సాయిరాం, సాయినందినిలతో చర్చించారు. రోగులకు ఇస్తున్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యమోటో సేన్ మాట్లాడుతూ ఫైలేరియా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, వ్యాధి నివారణకు ప్రత్యేకంగా మందులు తయారు చేసి ప్రభుత్వాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఫైలేరియా తీవ్రత ఉన్న గ్రామాల్లో పర్యటించి దత్తత తీసుకుంటున్నామని, త్వరలో ఒమ్మి గ్రామంలో వ్యాధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం సతివాడ పీహెచ్‌సీ ఆవరణలో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు పండ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, జపాన్ వైద్యులు నగనే సాన్, నిసకవ్ సాన్, గిరిస్ సాన్, అనిల్ సాన్, జోసెఫ్ సాన్, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామస్వామిని దర్శించుకున్న జపాన్ వైద్యులు



జపాన్ వైద్యబృందానికి ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానాన్ని జపాన్ దేశానికి చెందిన వైద్యులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు వారితో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆశీర్వచన మంటపంలో వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యబృందం ప్రతినిధులు యమోటో సేన్, నగనే సాన్, నిసకవ్ సాన్, గిరిస్ సాన్, అనిల్ సాన్, జోషెఫ్ సాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ కార్యాలయాలు

- జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువలో ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేశారని జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం మెరకముడిదాం మండలంలోని భైరిపురంలో రైతుభరోసాకేంద్రం, వెల్‌నెస్‌సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ భైరిపురం గ్రామంలో కోటి రూపాయల నిధులతో ప్రభుత్వభవనాలను నిర్మించినట్లు చెప్పారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలను చేసుకోవడంతో పాటు పార్టీలకతీతంగా ఎలాంటి వివక్ష చూపకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను సచివాలయాలు, వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు.

బాణసంచా కాల్చడం ఆశ్చర్యకరం

వందల కోట్లు దోచుకుతిన్న చంద్రబాబు జైలునుంచి బెయిల్‌పై విడుదలైతే టీడీపీ నాయకులు బాణసంచా కాల్చుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. బెయిల్‌పై చంద్రబాబు వచ్చినంత మాత్రాన నీతిమంతుడైపోయినట్లు కాదన్నది టీడీపీ నాయకులు గుర్తెరగాలని హితవు పలికారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పెద్దలు గద్దల్లా వచ్చి వాలతారు, అదే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే పేదలందరికీ సంక్షేమపథకాలు అందిస్తారని తెలిపారు. ఎప్పుడు ఎలాంటి ఎన్నికలు వచ్చినా, జగన్‌మోహన్‌రెడ్డి, బొత్ససత్యనారాయణ నాయకత్వంలో వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ మద్దతు ఉన్న అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఎంపీపీ తాడ్డికృష్ణవేణి, తాడ్డివేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, కేఎస్ఆర్‌కే ప్రసాద్, సర్పంచ్ పప్పల విజయ, పప్పల కృష్ణమూర్తి, వైస్ఎంపీపీలు కందులపార్వతి, తలచట్లహరిబాబు, పప్పల జ్ఞానేశ్వరరావు, కందుల మల్లికార్జునరావు, సింగవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అండర్-14,17 స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న 67వ స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీల్లో పాల్గొన బోయే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. 3న హ్యాండ్‌బాల్ క్రీడంశంలో బాల, బాలికలకు విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో, సెపక్‌తక్రా క్రీడంశంలో స్థానిక వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ -14, 17 బాల, బాలికలకు ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అదేవిధంగా 4న దత్తిరాజేరు మండలంలోని గడసాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెట్‌బాల్ క్రీడలో అండర్-14,17 విభాగాల్లో బాల, బాలికలకు, గరివిడి మండలం కోనురు జెడ్పీ హై స్కూల్‌లో ఖోఖో క్రీడకు సంబంధించి అండర్ -14,17 విభాగాల్లో బాల, బాలికల ఎంపిక జరగనుంది. 7న నెల్లిమర్ల మండలం అలుగోలు జెడ్పీ హై స్కూల్‌లో అండర్ -14,17 విభాగాల్లో కబడ్డీ జట్ల ఎంపిక, 10న విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో అండర్ -14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నామని వివరించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, ఆ రోజుల్లో జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

4న అండర్-19 నెట్ బాల్, సెపక్ తక్రా జట్ల ఎంపికలు

రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 బాలబాలికల నెట్‌బాల్, సెపక్ తక్రా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 4న నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీపీఎల్ ఎస్ కృష్ణ గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నగరంలోని విజ్జీ స్టేడియం ప్రాంగణంలో నెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక, వీటీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సెపక్ తక్రా క్రీడాకారుల ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం కె.కామేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు

రామభద్రపురం: ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలలో రామభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. డిస్క్ త్రో పోటీలలో పి.ఇందు, షాట్‌పుట్ పోటీల్లో ఎం.మేఘన ప్రతిభచాటి, స్టేట్ క్రీడా అథారిటీ అధికారులతో ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు డి.శ్రీదేవి, బి.వెంకట రావు తెలిపారు.అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను పాఠశాల హెచ్‌ఎం కె.కామేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయస్థాయిలో ప్రతిభచూపాలని ఆకాంక్షించారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన సంతోష్‌ను అభినందిస్తున్న ఆరికతోట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాదరావు



జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం భాస్కరరావు, రత్నకిశోర్ తదితరులు

రామభద్రపురం: అనంతపురం జిల్లా చిగిచెర్లలో ఈ నెల 28,29,30వ తేదీలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీల్లో కొట్టక్కి పాఠశాలకు చెందిన విద్యార్థినులు నీలాద్రి నీలామ, తూముల యశోద, ఆరికతోట ఉన్నత పాఠశాలకు చెందిన తూముల సంతోష్‌లు స్వర్ణ పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి.రత్నకిశోర్, వి.అప్పలనాయుడులు తెలిపారు.అండర్ 19 బాలికల విభాగంలో నీలిమ 40 కేజీల విభాగంలో, అండర్ 14 బాలుర విభాగంలో తూముల సంతోష్ మైనస్ 30 కేజీల విభాగంలో అండర్ 14 విబాగంలో కొట్టక్కి గ్రామానికి చెందిన యశోద 70 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించారని చెప్పారు. వీరు ఈ నెల 16,17,18,19 తేదీలలో జమ్ము, కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయిలో జూడో పోటీలలో పాల్గొంటారని తెలిపారు.అలాగే ఆరికతోట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మైనస్ 50 కేజీల విభాగంలో ఎ.ప్రేమ్, మైనస్ 30 కేజీల విభాగంలో ఎన్ గణేష్ కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రావాడ భాస్కరరావు, జీవీఎస్ ప్రసాదరావుతో పాలువురు ఉపాధ్యాయులు అభినందిస్తూ జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

- ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి



వ్యవసాయ పరిశోధన స్థానంలో పర్యటిస్తున్న శారదా లక్ష్మీ దేవి, తదితరులు

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె స్థానిక గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పడిపోని రకాలు, పక్షుల బెడద నుంచి తట్టుకునే కంకు ఉండే రకాలను వృద్ధి చేయాలన్నారు. అదే విధంగా అగ్గితెగులు తట్టుకునే రకాలపై పరిశోధనలు చేయాలని సూచించారు. జిల్లాకు విశిష్ట అనే వేరుశనగ రకాన్ని పరిచయం చేయాలన్నారు. భూమిలేని వారికి కోళ్ల పెంపకం, పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చి.. ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రానున్న రోజుల్లో చిరుధాన్యాలు, ఆరుతడి పంటల అవసరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తర కోస్తా జిల్లాల సహా పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ నర్సుపల్లి అనురాధ, తేజేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.